## బోనాల జాతరకు పటిష్ట బందోబస్తు



సమావేశంలో మాట్లాడుతున్న మహంకాళి ఏసీపీ రమేశ్

బేగంపేట్ జూలై 13: మహంకాళి బోనాల జాతరను ఈ నెల 9,10న నిర్వహించనున్న నేపథ్యంలో ఉత్సవాలను విజయవంతం చేయాలని మహంకాళి డివిజన్ ఏసీపీ రమేశ్ సూచించారు. సోమవారం పోలీస్‌స్టేషన్ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమ్మ వారికి బోనాలు సమర్పించే మహిళల కోసం రెండు క్యూలైన్‌ల ద్వారా అనుమతించనున్నట్టు తెలిపారు. మహిళలు బంగారు ఆభరణాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. బోనాలు సమర్పించే మహిళలు చెప్పులను ఆలయానికి దూరంగా పెట్టుకొని రావాలని సూచించారు. జాతరలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఆలయ పరిసరాల్లో 114 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. జాతర కవర్ చేసే ప్రింట్, అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఐడీ కార్డులను సమర్పించి మీడియా పాసులను పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ కావేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి పూజలు



పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ దేదీప్య రావు,ఆలయ చైర్మన్ రమేశ్


వెంగళరావునగర్, జూలై 3 : గురుపౌర్ణమి సందర్భంగా సాయినాథుని ఆలయాలు భక్తజన సందోహంతో కిక్కిరిసిపోయాయి. డివిజన్‌లోని జీటీఎస్ కాలనీ శ్రీ వీరాంజనేయ భవానీ శంకర అయ్యప్పస్వామి సహిత సాయిబాబా ఆలయంలో వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య రావు, ఆలయ చైర్మన్ చిన్న రమేశ్‌తో కలిసి కుంభాభిషేకం, మంగళ హారతులతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్పొరేటర్ దంపతులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ నాయకులు,జీటీఎస్ దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**బోరబండలో..**

ఎర్రగడ్డ, జూలై 3: గురు పౌర్ణమిని పురస్కరించుకుని సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు చోటు చేసుకున్నాయి. బోరబండలోని దేవాదాయ శాఖకు చెందిన ఆలయంలో జరిగిన పూజలు, అన్నదాన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. స్వరాజ్‌నగర్ హరిహర క్షేత్ర దేవస్థాన ప్రాంగణంలోని సాయిబాబా ఆలయంలో కూడా గురు పౌర్ణమి సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా కన్పించింది. ధర్మకర్త కల్వల సత్యనారాయణ రావు, కమిటీ ప్రతినిధులు పూజలో పాల్గొన్నారు.


## ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

జూబ్లీహిల్స్,జూలై3: వార్డు కార్యాలయాల్లో ప్రజల ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపుతున్నామని.. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ రమేశ్ కోరారు. సోమవారం యూసుఫ్‌గూడ వార్డు కార్యాలయాన్ని అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు వచ్చిన ఫిర్యాదులు, పరిష్కారాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమ సమస్యలను ఎప్పటికప్పుడు వార్డు కార్యాలయాల్లో తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వార్డు కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, వార్డు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కమల్, వార్డు అధికారులు వేణు, వినయ్ కుమార్, సూర్య కుమార్, అభినవ్, సిబ్బంది పాల్గొన్నారు.



వార్డు కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంసీ రమేశ్

# దాతల చేయూతతో ఆలయాల అభివృద్ధి



అమీర్‌పేట్‌లోని సాయిబాబా సన్నిధిలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట్, జూలై 3 : దాతల చేయూతతో అమీర్‌పేట్ డివిజన్ బాపూనగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. సోమవారం గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఇక్కడి దేవాలయ ఆవరణలోని సాయిబాబా ఆలయంలో నిర్వహించిన వేడుకలకు మంత్రి విచ్చేశారు. ఈ మేరకు బస్తీ వాసులు మంత్రి తలసానిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. అనంతరం అమీర్‌పేట్ హనుమాన్ దేవాలయ ఆవరణలోని సాయిబాబా ఆలయంలో మంత్రి గురుపౌర్ణమి పూజాలోల పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషుకుమారితో పాటు బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు హరిసింగ్‌జాదవ్, బీఆర్ఎస్ నాయకులు కూతురు నర్సింహ దేవాలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

● సనత్‌నగర్ హనుమాన్ దేవాలయ ఆవరణలోని సాయి బాబా దేవాలయంలో గురుపౌర్ణమి పూజలు నిర్వహించారు. ఈవో శ్రీనివాస్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో కార్పొరేటర్ కొలను లక్ష్మిరెడ్డి దంపతులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వయోధికులకు ఉచిత వైద్య శిబిరం



మందులు అందజేస్తున్న నిర్వాహకులు

అమీర్‌పేట్, జూలై 3 : మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచనల మేరకు మాగ్నిస్ డయాగ్నస్టిక్స్ ఆధ్వర్యంలో ఎస్ఆర్‌నగర్ బాపూనగర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నిర్వాహకుడు శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని మంత్రి తలసాని సందర్శించారు. దాదాపు 200 మందికి ఉచిత వైద్య పరీక్షలతో పాటు వారికి అవసరమైన మందులను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ అమీర్‌పేట్, ఎస్ఆర్‌నగర్ పరిసరాల్లో వయోధికులకు ఉపయోగపడేలా రాబోయే రోజుల్లో మరిన్ని ఉచి వైద్య పరీక్ష శిబిరాలు నిర్వహిస్తామని వెల్లడించారు. మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, బాపూనగర్ అధ్యక్షుడు హరిసింగ్‌జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం



లబ్ధిదారులతో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

వెంగళరావునగర్,జూలై 3: పేదింటి ఆడపిల్లల కండ్లల్లో సీఎం కేసీఆర్ సంతోషాన్ని నింపుతున్నారని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. సోమవారం జవహర్‌నగర్‌లో వెంగళరావునగర్ డివిజన్ కు చెందిన 20 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల జీవితాల్లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు వెలుగులు నింపుతున్నాయన్నారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా కేసీఆర్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. ఆడబిడ్డల ముఖాల్లో తెలంగాణ ప్రభుత్వం చిరునవ్వు తెచ్చిందని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దేదీప్య రావు, డివిజన్ అధ్యక్షుడు వేణు గోపాల్ యాదవ్, వేణు,మాజీ కార్పొరేటర్ శ్యామ్‌రావు, గజ్జల బాలకృష్ణ, అఫ్సర్,సత్యనారాయణ, కృష్ణ,పవన్ పాల్గొన్నారు.



క్రికెట్ కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

### 19న నాకౌట్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ఎర్రగడ్డ, జూలై 3: మంత్రి కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాకౌట్ క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తెలిపారు. రహ్మత్‌నగర్ డివిజన్ ఎంజీఎన్ ప్లే గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఎంజీఎన్ ప్లే గ్రౌండ్ వేదికగా ఈ టోర్నమెంట్‌ను ఈ నెల 19న ప్రారంభించనున్నట్లు, 23న ఫైనల్ మ్యాచ్ ఉంటుందని పేర్కొన్నారు. ఐతే ఈ నెల 16న పోటీలో పాల్గొనే జట్లకు టీ షర్టులు, షూ అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశం అనంతరం జట్ల సభ్యులకు క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, రాజ్‌కుమార్ పటేల్, దేదీప్య, డివిజన్ల అధ్యక్షుడు కోనేరు అజయ్, సంజీవ, ప్రదీప్, సంతోష్ ముదిరాజ్, కృష్ణమోహన్, నేతలు విజయకుమార్, నజీర్, సిరాజ్, షరీఫ్, జాఫర్, శ్యామ్‌రావు, బషీర్, నర్సింగ్‌దాస్, నాగరాజు, జబ్బార్, గని తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి



మాట్లాడుతున్న డిప్యూటీ సెక్రటరీ ప్రసాద్

ఎర్రగడ్డ, జూలై 3: తెలంగాణ వ్యాప్తంగా గురుకుల విద్యాలయాల్లో ప్రభుత్వం మౌలిక వసతులను కల్పిస్తున్నదని తెలంగాణ గురుకుల పాఠశాలల డిప్యూటీ సెక్రటరీ ప్రసాద్ అన్నారు. బోరబండలోని బాలికల గురుకుల పాఠశాలను సోమవారం సందర్శించిన ఆయన ఆ ప్రాంగణంలో విద్యార్థినులకు కావాల్సిన వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సుజాతకు పలు సూచనలు చేశారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ తాగునీటి సమస్య ఎక్కువగా ఉన్నదని తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవటం జరుగుతుందని.. అంతవరకు అవసరమైన సందర్భాల్లో జల మండలి ట్యాంకర్ ద్వారా తెప్పించుకోవాలన్నారు. పాఠశాల ఆవరణలో హైమాస్ట్ విద్యుద్దీపాల కొరత ఉన్న విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ అతి త్వరలో ఏర్పాటు చేయిస్తామని వివరించారు. ఇంజినీరింగ్ విభాగానికి చెందిన యూసుఫ్ పాల్గొన్నారు.

## హరితహారంలో మొక్కలు పంపిణీ



నర్సరీలను పరిశీలిస్తున్న యూబీడీ అధికారులు

జూబ్లీహిల్స్,జూలై3: హరితహారం కార్యక్రమంలో విరివిగా మొక్కలు పంపిణీ చేయనున్నట్లు అర్బన్ బయో డైవర్సిటీ అధికారులు తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఐదు మొక్కలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా జీహెచ్ఎంసీ అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ అనిల్ కుమార్, మేనేజర్ యూసుఫ్ పాషా, టెక్నికల్ అసిస్టెంట్ మహబూబ్ అలీతో కలిసి నర్సరీలను సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ యూసుఫ్‌గూడ సర్కిల్‌లో అర్బన్ బయోడైవర్సిటీ ఆధ్వర్యంలో 1.28 లక్షల మొక్కలతో హరితహారం కార్యక్రమం చేపట్టనున్నామని తెలిపారు.

## విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్నామని యూసుఫ్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. సోమవారం యూసుఫ్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్ఎం నరసింహ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు.

–జూబ్లీహిల్స్,జూలై3:

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెంగళరావునగర్,జూలై 3: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. మధురానగర్ ఎస్సై యుగంధర్ తెలిపిన వివరాల ప్రకారం..లింగంపల్లి ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ పెద్ద అంజప్ప(35) గత నెల 19న మధురానగర్ సమీపంలోని సిద్ధార్థనగర్ కాలనీలోని నర్సమ్మ ఇంటికి వెళ్లి పండ్లు తెంపేందుకు చెట్టును ఎక్కడంతో కాలు జారి ట్రాన్స్‌ఫార్మర్ పై పడి తీవ్రంగా గాయపడ్డాడు. అంజప్పను స్థానికులు గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ అంజప్ప సోమవారం మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.